

# దయ్యం

**వీరాజీ**

లారీ ఫుల్‌లోడ్ మీదుంది ఇంజన్

"కుయ్యో, మొర్రో" అంటూ యీడుస్తోంది! నిజానికి లారీ 'ఓవర్‌లోడ్' మీదుంది... దాన్నిండా మామిడికాయల బుట్టలున్నాయి... కాని వాటిలోపల భద్రంగా దాక్కొని వో పది పదిహేను దాకా దొంగ సిమెంటు బస్తాలు వాటర్ ప్రూఫ్‌గుడ్డ క్రింద వున్నాయి.

డ్రయివర్ గురువులు కూడా 'ఫుల్ లోడ్' మీదే వున్నాడు! 'స్టీరింగ్ వీల్' మీద ఒక చెయ్యేగాని రెండో చెయ్యి వెయ్యడం పరువుతక్కువ అనుకునే గురువులు 'ఓవర్‌లోడ్' మీదున్నాడన్న భయం, క్లీనర్ అప్పలస్వామి తన గుండెల్లో గుబులై దొలుస్తూండగా, ప్రక్కనే కూర్చున్నాడు! అంతా చిమ్మ చీకటిగా వుంది— అది చతుర్దశో, అమావాశ్యో, గురువులికి తెలియదు! గురువులు నోట్లో జానెడు పొడుగుచుట్ట ఎఱ్ఱ ఎఱ్ఱగా కాల్తోంది—అప్పలస్వామి పుగాకు నములుతున్నాడు...

లారీ 'హెడ్ లైట్లలో' ఒకటి పోయి పక్షం రోజులైంది. రెండోది చిన్న ఆముదం బుడ్డీలాగ వెలుగుతోంది...అది విరజిమ్మే 'వెల్తుర్ని' చిక్కని చీకట్లు బుగ్గని పెట్టేసుకుంటున్నాయి!

గురువులికింత చీకటివుంటే, చిరాగ్గా వుంటుంది -మరి ... కాస్సేపువరకూ, వో 'ఫియట్ కారు' వెళ్తోవుంటే, దాని వెంటబడ్డాడు! బ్యాటరీ 'వీక్' గా వుందని అసలే 'ఏకాక్షి' గా వున్న లారీని కాస్సేపు గ్రుడ్డిదాన్ని చేసి మరీ తోలాడు. 'గురువులు' అంత పెద్ద చుట్టను కాలుస్తూన్నా... దాని కంపును త్రోసి ఆ వెనకనుంచి నాటుసారాకంపు అప్పలస్వామి నాసికారంధ్రాలను అల్లరి బెట్టేస్తోంది!

"గురో" అన్నాడు క్లీనర్ అప్పలస్వామి— "నాయాల్ది యిది మరీ యడవి... మా యమ్మకి, నానొక్కణ్నే కొడుకునీ...దెయ్యాల్దిరిగే యేళ యిది.. లైటెయ్... ఏ 'దెయ్య'మైనా బండి నట్టుకుని డొంకల్లో కీడ్చేసిందంటే మరి మీ యమ్మనీ మా యమ్మనీ కూడా పిల్లేం!!"

గురువులు కాల్తూన్న, ఎఱ్ఱని కొసగల నల్లని చుట్టని గారపళ్లమధ్య బిగించి విచిత్రంగానవ్వాడు "ఓ రెర్రా! స్టెపినీ! యియ్యాళచస్తేరేపు రెండు" అన్నాడు- అని ఆ వెంటనే గర్వం గొంతులో చిందులాడుతుండగా "గురువులి బండినే దయ్యం డొంకల్లోకి లాగుద్దే!?... దాని సిగతరగా!" అన్నాడు— అలా అని వూరుకున్నాడా? పౌరుషంగా 'యాక్సిలరేటరు' మీద కాలి బొటనవ్రేలు తీసేసి దానిమీద మడమ పెట్టి నొక్కాడు...

ఎదురుగా, వస్తున్న టాక్సీవాడు, యీ లారీనిచూసి హడలి చచ్చి లైట్లని ఆర్పి, వేసి, ఆర్పి... "ఆపద్బాంధవా పరమేశ్వరా! శరణు! శరణు!" అన్నట్లు అల్లాడిపోతున్నాడు... కాని గురువులు కనికరించలేదు.

"లైట్లార్పేసేసరికి... నాయాళకి మనబండీ దెయ్యంలాగ అగపడతోంది గావును—" అంటూ గురువులు, లారీ కుడి కన్నును కాస్త తెరిచాడు...

"అంబాసిడర్ కేంతోచలేదు ... ఎదురుగ్గా లోడ్ లారీ టావ్‌గేర్‌లో,



దెయ్యంలాగ దూసుకువస్తోంది— 'ఆర్త నాదం' చేయడంకన్న మార్గాంతరం లేక హారన్ వాయించేస్తున్నాడు పాపం!

"ఎదవరోడ్డు. సన్నగా బక్కోడి గోచీ పీలిక నాగుంది... రోడ్డు గట్టు మీంచి దిగామో, మరి లెగడం ఉత్తది. అందుకనే "తప్పుకో, నాయాళా ! నీ బాబుతో చెప్పుకుని మరీ రోడ్డు దిగి తప్పుకొని పో" అన్నట్లు గురువులు ఏక్సిలలేటరు మీది కాలు బ్రేకుమీదికేనా తీయకుండా, రబ్బరు బుంగ హారన్‌ని "బాంయ్ బాంయ్" మనిపించాడు.

"అంబాసిడర్" యింకేం చేస్తాడు- రోడ్డు వారకి క్రిందికి దిగిపోయి చచ్చినంత "కల" గాసి, వెంట్రుకవాసిలో లోడ్ లారీ దెబ్బనుంచి తప్పుకుని, "బ్రతుకు జీవుడా" అంటూ పోయాడు.

అప్పలస్వామికి పోయిన ప్రాణం తిరిగి వచ్చింది. "ఛి : ఛి! యీడియ్యాళ నన్ను చంపీకుండా ఒగ్గడు. చెబితే యినడు. కడుపెక్కా పట్టించకురా ! "సారా" చూస్తే వొళ్ళెరగనాడివి, జాగరత సుమీ ! అంటే యిన్నాడా యెదవ లారీ కొడుకు" అని మనసులోనే డ్రయివర్‌ని సాధ్యమైనంత క్లీన్‌గా తిట్టుకున్నాడు క్లీనర్!

కైటకిమాత్రం కొంచెం ఎటకారంగా మాట మళ్ళించి దారిలోకి తెద్దాం అనుకుంటూ— "గురో ! దెయ్యాలుంటా యంటావా?" అన్నాడు.

"నే నంటానా ? అననా ? అంటా వేంటి ? అసలు నువ్వేంటంటావు ?" అన్నాడు గురువులు దూరంగా వ్రేలాడుతున్న చిమ్మ చీకట్లను మూతపడే కళ్ళు తెరచి చూచుకుంటూ...

బరువైన చీకటి లారీమీద పడి వెంటాడుతూవున్నట్లే—సారా "నిషా" గురువులి వెంటాడుతున్నది. వాడి బుర్రలో "రంభ" గుద్దిప్పుకుని చౌ చౌ డ్యాన్సుచేస్తున్నట్లుంది. "నిషా" ప్రభావం నరాల్లోకి దొలుచుకు పోతోంది.

పిచ్చిపీరులాగా వూగుతూ పోతోంది, లారీ దూరాన్ని బారంగా మింగుతూ...

గోంతుల్లోపడ్డప్పుడూ, లేచినప్పుడూ, యింజనూ, అప్పలస్వామి గుండె కూడా ఆగినంత పన్జేసి తిరిగి పుంజుకుంటున్నాయి. రోడ్డుకి రెండుప్రక్కలా పొలాలూ, డొంకలూ చింత చెట్ల క్రింద గుసగుసలాడుకుంటున్నాయి.

కీచురాళ్ళ సవ్వడి వెలుపల జోరుగా వుందికాని, అది లారీ లోపలి జీవులిద్దరికి వినిపించటంలేదు.

అప్పలస్వామికి అన్ని దయ్యాల కథలే జ్ఞాపకం వస్తున్నాయి.

"నానంటే వుంటయ్యా ! లేదంటే మానేస్తాయా! ఈ రోడ్డుమీదనే ముగ్గురు దుక్కల్లాంటి మడుసులు మనలాంటి లారీ కిందపడి కుక్కచావు చచ్చారంట! ఆళ్ళల్లో ఒకడు దెయ్యమైపోయి చింత చెట్టెక్కిపోయి లారీలమీదకి దూకి మట్టేస్తన్నాడంట" అన్నాడు అప్పలస్వామి గట్టిగా ఆలోచించుకున్నట్లు...

"వోరెళ్ళెహె !... మన జోలికొస్తే దెయ్యం మయ్యేదీ, దానమ్మ మొగుడయ్యేదీ, 'బ్యాక్‌వీల్' క్రిందికి లాగి త్రొక్కేస్తాను! " అన్నాడు ... ... గురువులు లారీ హారన్ అప్రయత్నంగా కొడుతూ!

"అద్సరే గాని నువ్వి సైడు త్రిప్పుకొచ్చి వారంరోజులైందా!అన్నాడు అప్పలస్వామి సందేహంగా.

"అయ్యే వుంటుంది—వెన్నెల రాత్రులంతా అటుకేసి 'పార్టీటూ తర్టీసిక్స్' మీదెళ్లాను గదా!" అన్నాడు గురువులు.

గురువులు కంతే తెల్సు ... చీకటి రాత్రులు ఆంధ్రా ఒరిస్సాల మధ్య రోడ్లమీద గడిచిపోతే వెన్నెల రాత్రుళ్ళకి ఆంధ్రా మహారాష్ట్ర రోడ్లమీద ట్రిప్పులకి వచ్చేస్తాడు....

అప్పలస్వామికిది తెలియక కాదుగాని—గురువులు రొండో సైడు ట్రిప్పులో వున్నప్పుడే యీ రోడ్డుమీదికి కొత్తగా దెయ్యం వుట్టుకొచ్చిందనీ ......నేరుగా కాకుండా డొంకతిరుగుడుగా డ్రయివర్‌కి చెప్పాలన్నదే వాడి ప్రయత్నం.

చింతతోపు ప్రాంతానికి వొస్తావుంది లారీ మరి నాలుగామడల దూరంలో "హోల్టింగ్" గ్రామం వుంది......చింత చెట్లంటేనే అప్పలస్వామికి భయం —కోపంవస్తే యిద్దరు గట్టిమనుషుల్ని ఒక్క గుద్దుతో క్రిందపడేయగల్డు గాని చీకట్లో చింతచెట్టును చూస్తే చాలు చెమటలు పోసుకుంటాడు!!

గురువులు కొంచెం అస్థిమితంగా కదిలి... చుట్ట నమిలాడు. "ఛన్! గుడ్డి లారీలిచ్చే ప్రొప్రయిటర్ నాయాళ్ళని ఎనక చక్రం క్రిందకి లాగి కుడికాలిర్చేయాల!" అని తిట్టుకున్నాడు. ...

చింతచెట్లు ఒటొకటీ, యిటొకటీ దూసుకుపోయాయి......

"గురో! భద్రం! తాపీగాలాగించు. మన నైట్ హాల్టింగ్ దగ్గర్లో కొచ్చేత్తన్నాం. వూరి చివర అదో స్మశానం కూడా కనపడతోంది"—అప్పలస్వామి విజ్ఞప్తి.

గురువులు "నిషా" మీదున్నాడేమో స్టీరింగ్‌మీద రెండో చెయ్యి కూడా వేశాడు.

అంతలో దూరంగా... చీకట్లో... కొంగరెక్కలాంటిదేదో తెలుపు!... ... కొంగరెక్కలాంటిది...కాస్తా 'సున్నం దారం'తయింది!!...కాస్సేపట్లో తెల్లనిదేదో నల్లని చీకట్లో నిలువెత్తున 'తుప్పు తుప్పు'న గెంతుతున్నట్లుగా వుంది!! జిగేల్ జిగేల్ మని వెలుగు కూడా!! గురువులు గుండె 'ఝల్లుమంది' ... అప్పలస్వామి కళ్లనులుముకుని చూశాడు లారీమీదేదో 'ధన్' మని దూకినట్లుంది ...గురువులికి పీకెం దాకావున్న సారా బెక్కు యిచ్చింది!

"అది దెయ్యమే గురూ! చూడు... ఎలా క్రిందికీ పైకీ ఎగిరెగిరి పడుతుందో ...అరె చెట్టు పైకెగిరిపోయిందే - దీంతస్సదియ్యా!" అన్నాడు అప్పలస్వామి.

గురువులికి కూడా భయంవేసింది. ముచ్చెమటలు పట్టాయి. చీకట్లో తెల్లని సున్నం దారికల్లాగా దెయ్యం నృత్యం చేస్తూంటే, ప్రక్కన అప్పలస్వామి హడలి ఛస్తూంటే...స్టీరింగ్‌మీద రెండు చేతులూ గట్టిగా వేశాడు. దెయ్యం యింకా పెనంమీది పేలగింజలాగ తుప్పు తుప్పు తూలుతూనే వుంది!!!

హారన్ మోతకి దెయ్యంలో భయం రాలేదు—వెనక చక్రం క్రిందకి లాగి దాన్ని చంపేస్తానని కొంచెంసేపు క్రితం 'బీరాలు' పలికిన గురువులికిప్పుడు దాన్ని ముందుచక్రం కింద పడకుండా; పడి తన లారీని డొంకల్లోకి లాగేయకుండా, కాపాడుకొవలసిన గతి పట్టింది!!

కాలు బ్రేకుమీదనేవేద్దామనుకున్నాడు గానీ, భయంచేత— వణికిపోతున్న గురువులికాలు ఏక్సిలిరేటర్ మీద పడింది. స్టీరింగ్ ఎడం ప్రక్కకి తిప్పేడు... అంతే—లోడ్ లారీ ... దెయ్యం మీద నుంచి దూసుకుపోయి, రోడ్డుమీదనుంచి జారిపోయి, డొంకల్లోకి దిగిపోయి, గోతుల్లోపడి, ఎదురుగానున్న ఒక మొండి చెట్టుకు ఢీకొని ఆగిపోయింది.

లారీ మట్టేసిన దెయం "అమ్మోయ్......అమ్...మ్మా..." అన్న ఆర్తనాదం చేసింది. చీకటి వెనుక దాగిన ఆకాశం గుండా ప్రతిధ్వనిలేని ఆ కేక దూసుకుపోయింది.

అప్పలసామి ముందు దూకేశాడు... గురువులు మరో రెండుక్షణాలకి దూకేసి వెనుదిరిగి చూడకుండా అదే పరుగు లంకించుకున్నాడు. మోకాలి చిప్పలూడిపోయినట్లు కాళ్ళు తొట్రుపడుతూంటే ...ఆ యిద్దరూ, రోడ్డుమీద పరిగెత్తలేక ప్రాకడం మొదలెట్టారు. ఎదురుగా వచ్చే టాక్సీ డ్రయివర్ యీ వింత దృశ్యం హెడ్‌లైట్ల ముందు చూసాడు.

"దున్నపోతు నాయాళ్ళు ఫూటుగా తాగేసి ఎలా ఏసాలు ఏస్తున్నారో చూడు" అనుకుంటూ, టాక్సీ ఆపి, దిగివచ్చిన డ్రయివర్‌కి-గురువులూ, అప్పలస్వామీ వున్న అవస్థ అర్థమవటానికి ఎన్నో క్షణాలు పట్టలేదు.

"ఏం జరిగింది గురూ!?" అడిగాడు.

"దె...ద్దె...య్యం"

"ఎక్కడా"? — ధైర్యం కోసం గుండెలమీద చెయ్యివేసుకుని అడిగాడు టాక్సీ డ్రయివరు.

మసక చీకట్లో తెల్లతెల్లని ఖండాలేవో రోడ్డుమీద కనపడటంతో యీ యిద్దర్నీ లేపి పట్టుకుని "అర్ధరాత్రి యీడ ఎవడు చచ్చాడబ్బా!" అంటూ ముందుకి కదిలాడు టాక్సీ డ్రయవరు

టాక్సీలోవున్న యిద్దరుప్రయాణీకులు కూడా హడావుడిగా దిగారు ...

వాళ్ళ వ్యాపారం వేరు ... వాళ్ళకిదంతా చూసేసరికి పోలీసులు జ్ఞాపకం వచ్చారు...

"వోర్నీ? తెలివి దున్నలుదోలా!... దెయ్యం దెయ్యం అంటూ పిరికినాయాళ్ళు భయపడిపోయారు...పదపద లాగించు మనకి లేటవుద్ది"... అంటూ వాళ్ళిద్దరూ టాక్సీ డ్రయివరుని వెనక్కిలాగిటాక్సీలో పడేశారు — "పోలీసు దెయ్యాలొచ్చాయంటే మన బతుకు కోర్టు పక్షుల పాలైపొద్ది—తోలేహే —నీ..." అని వాణ్ణి అదిరించుకుపోయారు

టాక్సీ యీ వ్యవహారమంతా మర్చిపోవడానికా అన్నట్లు రోడ్డుమీదపడున్న మానవాకారపు ఖండాల్ని తప్పించుకు పారిపోయింది. దాని డేంజర్ లైట్లు చీకటిలో కలిసిపోయేదాకా బిక్కచచ్చిపోయి చూసిన గురువులుకి నిషా దిగిపోయింది. అసలు సంగతి అర్థమయిపోయింది.

"ఎదవ నాయాళ! దెయ్యం దెయ్యం అని చంపేశావురా... ఆ దెవడో ఫ్రంట్ వీల్ క్రిందపడి చచ్చాడు...పద బండి బయటికి లాగిద్దాం..." అన్నాడు. కానీ అప్పలస్వామిది పిరికిగుండె ఏడుపు లంకించుకున్నాడు — బండి యింజను దెబ్బ తినేసింది— అది కదల్లేదింక! చచ్చిన దేమిటో చూద్దానికి యిద్దరికీ ధైర్యంలేదు బండి నిండా సరుకుంది. పగలయితే పారిపోయేవారు. "జనం చంపేస్తారని భయపడి పారిపోనాం" అని చెప్పటానికయినా వీలుంటుంది. కనుక పారిపోవచ్చును. లారీ కదిలితే పారిపోయేవాళ్ళే కానీ అది కూడా జడ పదార్థమయిపోయింది. యింకేంచేయాలి?

"దెయ్యం బండిలాగింది గురూ! నా మీదొట్టు" అంటూనే అప్పలస్వామికూడా గురువుల్ని అనుసరించాడు—అలాంటి చోట సాక్షులుండటం ఎంతప్రమాదమో తెల్సు కనుక గురువులు సొంత కాళ్ళ మీద ఆధారపడ్డాడు. దారిలో ఒక ఆయిల్ టాంకర్ తగిలింది.కానీ దాన్ని ఆపడానికి ప్రయత్నం చేయలేదువాళ్ళు.

* * *

కేసు దొరికిందన్న ఆనందంకన్నా- సబ్ యినస్పెక్టర్ కి నిద్దరలేపేరన్న దుఃఖం ఎక్కువగా వుంది.

"ఈళ్ళిద్దర్నీ, ముందా బొక్కలో తోసేయండి" అంటూ లాకప్ సెల్ కేసి చేయి చూపించి హెడ్డుమీద గర్జించాడు.

కానీ రైటరు... వీళ్ళ స్టేటుమెంట్లు రాసుకున్నాడు. హెడ్డు జీపు సిద్ధం



చేశాడు. రక్తం మడుగులు కట్టిపడిన దెయ్యం ముక్కల్ని చేర్చిచూస్తే, నల్లని ఆరడుగుల ఆకారం తయారైంది. ఆది తొడుక్కున్న తెల్లని బురఖా క్రింద కాకి నిక్కరు, కాలరు బనీను వున్నాయి. కానీ దేనికదే ముక్కలై పోయాయి శరీరభాగాలు....చివరికి...మొత్తంమీద తెల్లారేసరికి అది మనిషికళేబరం అన్న మాటమీద అప్పలస్వామికూడానమ్మక మేర్పడిపోయింది.

ఖండాల్ని కలిపిన శవం మాత్రం పోలీసు స్టేషనుకు తెచ్చారు. లారీని తరవాత లాగొచ్చునన్నాడు యస్ ఐ.

ఎట్టకేలకు పోలీసు సోములు మొదట పోల్చేసాడు "ఈడు ముక్కుపోగు నరసింగులు" అన్నాడు గర్వంగా, తన డిస్కవరీని మెచ్చుకోమన్నట్లు చూసి అందరివేపు.

గురువులికూడా అర్థమయిపోయింది. ఎన్నోసార్లు ఈ 'ముక్కుపోగ్గాడి"తో సావాపందెం ఏసుకున్నాడు. 'ఆడిది కడుపుకాదు-పెట్రోలుడ్రమ్ము' అని కూడా అనుకునే వాడు.

—తెల్లారేసరికి శవ పంచాయతీ పూర్తయింది. ఆ వూరు వూరంతాగోలైపోయింది.

'ముక్కుపోగులాడు మంచోడు పాపం...అది దావు ఆణ్ని అట్టా అర్ధరాత్రి అడవిలోకి ఈడ్చుకుపోనాది'— అన్నారు.

"ఆడిలా తాగే మొనగాడుయికనేడు; యిక పుట్టడు!!" అనుకున్నారు తాగుబోతులు.

ఆసలు వాణ్ణి సారావే, దెయ్యమై పట్టిపీడించి యీ విధంగా చంపేసింది. ...అంతా కర్మ !... అన్నాడు కరణం పంతులుగారు...

'ముక్కుపోగులవాడి' నడుం దగ్గర నుంచి పైముక్క వేరైపోయింది. తలలో నరాలు చిట్లి వెంటనే ప్రాణం పోయియుంటుంది. వాడు సన్యాసులు వేసుకునే పెద్దసైజు అంగరఖా తెల్లనిది వేసుకుని వున్నాడు— అదే ఎందుకు వేసుకున్నాడు ? అన్నది ఎవ్వరికీ అర్థం కాలేదు!

కానీ లాకప్‌సెల్‌లో కూర్చొనివున్న గురువులికి కొంతవరకు అర్థమైంది.

పోయిన్నెల యిట్నుంచి బెజవాడ ట్రిప్పులోనే ముక్కుపోగులాడూ గురువులూ సింహాద్రిగాడి సారా అంగట్లో ఇద్దరూ కలిసి పీకలమొయ్యా తాగారు. —పొంగరాల కనకమ్మకి సంబంధించి వాళ్ళకి పాత తగూవుంది

"మరో బాటిల్ యిప్పించుకో" అన్నాడు ముక్కుపోగులాడు.

"నీ యబ్బ దిగిరావాల...యిప్పటికి తాగేసింది తక్కు"వన్నాడు గురువులు.

కలియబడ్డారిద్దరూ...

"ఎనక చక్రంకిందేసి మట్టియగల్ను నాయాళ !...నాకాడ నీ యసమం టోళ్ళని చంపటానికి లైసన్సుందిరా" — అన్నాడు గురువులు డ్రయివర్ లైసన్సును తల్చుకుని...

"పోరా పోరా సోతియా! దెయ్యమై పట్టుకొని నిన్నూ నీ లారీని డొంకల్లోకి యీడుస్తారా ! పందెం కాస్తావా ? నాన సతే మాకానోణ్ని" ముక్కుపోగులాడు బెదిరించాడు.

"పందెమా ? కాస్తారా నాయాళా!" అన్నాడు గురువులు.

జనం యిద్దర్నీ విడదీశారు.

అసలు కడుపులో అక్కసు పొంగరాల కనకమ్మ యీ మధ్య ముక్కుపోగులాడ్ని యీసడిస్తావుంది. గురువులంటేచాలు అది కులుకులొలకబోస్తావుంది. కానీ యిద్దరూ "సారా సీసా" మీదే తగూలాడుకుంటారు. బయట పడరు. అది ఎవ్వడికీ పెళ్ళాంకాదుగా!

* * *

హెడ్డు, దర్జీ కరీంసాయిబు మీద విరుచుకుపడ్డాడు. "ఎదవ నవాబు దరిజా ! ఆడు బురఖా కుట్టియ్యమంటే మల్లెపువ్వులాంటి గుడ్డముక్కలెట్టికుట్టిసి యిచ్చేదమేనా పోలీసోళ్ళకి చెప్పొద్దూ?" అంటూ—కరీం సాయిబు "మాఫ్‌కర్నా భయీ ! ఆడిలా సైతాన్ వేషంకడ్తాడని మన్కి తెల్దుకదా!" అన్నాడు.

* * *

అట్లా ముక్కుపోగులాడు గురువులు మీద కక్షకట్టాడు. ధైర్యంకోసం తాగేసి దెయ్యమైపోయాడు—ఫ్యాన్సీ కొట్టాడ్ని మస్కాకొట్టి టార్చిలైటోటి దొబ్బుకు పోయాడు. తెల్లని బుర్ఖా ఏసుకుని— టార్చి ఎలిగించి ఆర్పి, చింత చెట్లమించి దూకి దెయ్యం నాట్యంచేసి, గురువులి లారీడొంకల్లోకి లాగేయాలనుకున్నాడు-

ఆడంతపనిచేయడానికిఎన్నిరాత్రులు కాసేడో, గురువులుగాడి లారీ నెలా పోల్చేడో, అసలన్ని లారీలనీ అలాగే బెదిరిస్తున్నాడో, మరి పూర్తికర్యాప్తులో గానీ తెల్దు—కానిప్పటికిమాత్రం-యింతే నన్నాడు జనాంతికంగా యస్.ఐ. రంగారావు ! రింగు రింగు మంటూన్న ఫోన్ అందుకుని, "ఎస్. సార్" అంటూ టక్కున లేచి నిలబడ్డాడు. సర్కిల్ గారి ఫోన్ అన్న మాట అది! దాంతో అతని లెక్చర్‌కి ఫుల్‌స్టాప్. అతని యిన్వెస్టిగేషన్‌కి డబుల్‌ఫుల్‌స్టాపూ పడి పోయాయి

గురువులు స్థిమితంగా ఎలావుంటాడు దానికి తోడు అప్పలస్వామి "అన్నా ఆడు మన లారీ డొంకలు పట్టించినాడు! ఆడ్ని నువ్వు లారీ క్రింద మట్టేసినావ్. యిక ఆడు నిజం దెయ్యమై పట్టుకుంటాడేమో ఎలాగన్నా" అంటూ ప్రేలుడు ప్రారంభించాడు.

గురువులుకి వొళ్లు మంట, దుఃఖం రెండూ పెనవేయగా "ఓర్నీ... నోర్మూయెహే! నిన్ను కూడా దెయ్యం చేసేగల్ను" అన్నాడు కోడిపీక పట్టుకున్నట్లు అప్పలస్వామిమెడని పట్టుకుని.

కానిస్టేబులు యిద్దర్నీ విడదీసాడు. ఒకడైతే ఏక్సిడెంట్, రెండయితే ఖూనీలైపోతాయి! – గురువులు వెనక్కి తగ్గి, చుట్టతీసి నములుకుంటూ మూలకి పోయి కూలబడ్డాడు!

"ఓర్నీ సారా దెయ్యాలు తాగా... ఆదే గదరా యింత పేనాలు తీసిందీ" అంటూ ఆవతల్నించి జాలిపడుతూ వచ్చింది. గురువులికి హోల్టింగ్ నేస్తమయిన పొంగరాల కనకమ్మ! పిట పిటలాడే అందం దానిది!

"ఎల్లెహె! ఆసలిదంతా నీ నుంచీ వచ్చింది... నా ప్రాణానికి...మా షావుకారికి డబుల్ సెవెన్ డబుల్ జీరో త్రీకి ఫోన్ కొట్టించు ... ఏక్సిడెంట్ అయిపోయిందని ఎల్లు తొందరగా..."అంటూ అంతలో కుప్పలా కూలబడ్డాడు గురువులు. కనకమ్మ యస్. ఐ. దగ్గరికి పరిగెత్తింది.

చెట్టంత మనిషి గురువులు కన్నీరు కారుస్తుంటే అప్పలస్వామివాడ్ని ఓదార్చడానికెళ్ళాడు.

* * *

అవతల—

"యస్సయిబాబూ ! గురువులికి శిచ్చ పడదంటావా ? ఎన్నాళ్ళు పడుద్దేటి ? అంటూవున్న కనకమ్మని రంగారావు అదిలించాడు మేలమాడి—"ఏం ? ఆడు చస్తే నువ్వు ముండమొయ్యాల ? ఆడికి శిచ్చపడితే నీకేంటీనష్టం ? ఓ సెల్లే! నఖ్‌రాలు దీసి ఆవతల పెట్టి" -అని—

"అలాగనీకు బాబూ !" - అంది కనకమ్మ రంగారావుని అదోలాచూసి- అంతలో నవ్వి - మళ్ళీ విచారంపులుముకున్న మొహంతో "ఆడికి, శిచ్చపడనీకు బాబూ! చచ్చి నీ కడుపునపుడతా ..."నంటూ- అంతలో సర్కిల్ టకటకా బూట్లు చప్పుడు చేసుకుంటూ రావడం చూసి అవతలికి పరుగు తీసింది...